22.05.2020



## మున్నుడి 3-32

నేను ఈ మున్నుడి వ్రాస్తున్నది, సమయం ఆరు గంటలు, తెల్లవారబోతోంది. వైకుంఠ ఏకాదశి, శుక్రవారం. ఇంతకంటే ఈ కీర్తన చెప్పటానికి మంచి సమయం ఏముంటుంది? ఇది నా అదృష్టం. స్వయంగా పర్యవేక్షిస్తూ ఆనాడు ఇటువంటి సమయంలోనే అన్నమాచార్యులవారు ఈ కీర్తన చెప్పివుంటారు. ఆనాటి స్వామి సేవను మీ మనోనేత్రంతో మీరూ తిలకించి తరించండి. ఈ కీర్తనకున్న ఇంకొక ప్రత్యేకత ఏమంటే అన్నమయ్య కీర్తనలలో దర్శనమిచ్చే శ్రీవేంకటేశుని 'మకుటం' లేకపోవటం. నిఘంటువు లేకుండా దీన్ని వివరించగల పండితులు... బహుకొద్దిమంది.

**ఉ॥ కంటిమి శుక్రవారమనగా ఘడియల్ యిట ఏడు, స్వామి! నీ**
**కంటుచునుండె మా జనని ఆ యలమేల్ తిరుమంగచేరికై**
**పంటగ కన్నులున్ వెలిగె పాడెను కీర్తన మన్నమార్యుదున్**
**జంటగ భావమున్ దెలుప సాయము సేయర వేంకటేశ్వరా!**

రాగం : ఆనందభైరవి

కంటి శుక్రవారము గడియలేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామి ॥కంటి॥

సొమ్ములన్నీ కడబెట్టి సొంపుతో గోఅము గట్టి
కమ్మని కదంబము కప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు రొమ్ము తలమొలచుట్టి
తుమ్మెద మైచాయతోన నెమ్మదినుండే స్వామిని ॥కంటి॥

పచ్చకప్పురమె నూఅి పసిడి గిన్నెలనించి
తెచ్చి శిరసాదిగ దిగనలది
అచ్చెరపడి చూడ అందరి కన్నులకింపై
నిచ్చె మల్లెపూల వలె నిటుతానుండే స్వామిని ॥కంటి॥





తట్టు పునుగె కూర్చి చట్టలు చేరిచి నిప్పు
పట్టి కరగించి వెండి పళ్యాల నించి
దట్టముగ మేను నిండ పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియుచుండే బిత్తరి స్వామికి ॥కంటి॥

**భావామృతం :**

శుక్రవారమునాడు, ఏడు ఘడియల సమయంలో ఈ మహానుభావుని చూశాను. ఈయన తన దేవేరియైన అలమేల్మంగను అంటిపెట్టుకొనివామె వెంటనే వున్నాడు. (చూడండి... చూచి తరించండి.)

ఈ స్వామి తన నగలన్నీ ఒకప్రక్కన పెట్టి (అభిషేకం చేస్తే నగలు తడిసి పాడవుతాయికదా!) అందంగా గోఅము (గోచీవంటి చిన్న వస్త్రము) నొకదాన్ని కట్టాడు. పన్నీరు కలిపి చేసిన కమ్మని కదంబమును (మిశ్రమాన్ని) తడిసిన వలువలు రొమ్ము, తల, మొలచుట్టూ బిగింపబడియుండగా తుమ్మెద వంటి శరీర ఛాయగల ఆ శ్రీవేంకటేశ్వర స్వామి తన ప్రేమను (నెమ్మది) వ్యక్తము చేయుచూ శోభించుచున్నాడు.

బాగుగా నూఅిన పచ్చకర్పూరమును బంగారు గిన్నెలో నింపి తెచ్చి ఆపాదమస్తకము దిట్టముగా అద్ది, చూచువారు ఆశ్చర్య చకితులవుతుండగా వారందరికన్నుల కింపువునట్లు నిత్యమల్లె పువ్వువలె ఇచ్చట ప్రకాశించుచున్న ఈ శ్రీవేంకటేశ్వర స్వామిని (తిలకించి తరించండి)

'పునుగుపిల్లి' నుంచి వచ్చిన తట్టు పునుగు (తట్టి ఎత్తిన మేలు రకపు పునుగు అను సుగంధద్వ్యము) తో బాగుగా పూతలు వేసి నిప్పులో కరిగించి వెండి పళ్లెములలో నింపఇ తీసికొని వచ్చారు. దానిని స్వామి మేనికి దిట్టంగా పట్టించారు. తరువాత తీరికగా తీర్చి దిద్దారు. దానివలన శీఘ్రముగా ఆనందించిన ఆ తిరుమలనాధుడు బిత్తర స్వామియై (ప్రకాశము వెదజల్లు స్వామియై) కనువిందు చేసినాడు.



Scanned with CamScanner

22.05.2020



## మంగళహారతి

'భావయామి వేంకటేశమ్' లో వంద కీర్తనలు పూర్తిచేసి ధన్యుణ్ణి జేసిన వేంకటరమణునికి నా ఆనందభాష్ప సమేత మంగళనీరాజనములు. ఆయన హృదయాధిరూఢయైన అలమేల్మంగమ్మకు అన్నమాచార్యులవారు మధురాతి మధురమైన మంగళహారతి పాడుతున్నారు. వినండి. అమ్మవారి కిసలయ చరణాలకు, రంభోరువులకు అరిది జఘనములకు నీరాజనములిచ్చి ఆ శ్రీవేంకటేశ్వరునే పులకించి మైమరచిపో జేసిన ఆచార్యులనేమని పొగడుదునో కదా!

**ఉ॥ క్షీరసముద్రరాజసుత, శ్రీహరి కన్నుల వెల్గు లక్ష్మినిన్**
**నీరజవాసినిన్ కొలిచి నీమముతో వ్రతముల్ అనేకముల్**
**పేరిమిజేతురీ జనులు మేలగు కీర్తనలిట్లు పాడుచున్**
**కూరిమి అన్నమయ్య కృతి గొల్వరె వేంకటనాధురాజ్ఞినిన్**

**రాగం : మోహన**

క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయమునకు నీరాజనం ॥క్షీరాబ్ధి॥

జలజాక్షి మోమునకు జక్కువ కుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబునకు
నిలువు మాణిక్యముల నీరాజనం ॥క్షీరాబ్ధి॥

చరణ కిసలయములకు సకియ రంభోరులకు
నిరతమగు ముత్తేల నీరాజనం
అరిది జఘనంబునకు అతివ నిజనాభికిని
నిరతి నానావర్ణ నీరాజనం ॥క్షీరాబ్ధి॥





పగటు శ్రీవేంకటేశు పట్టపు రాణియై
నెగడు సతికళలకును నీరాజనం
జగతి నలమేల్మంగ చక్కదనములకెల్ల
నిగుడు నిజ శోభనపు నీరాజనం ॥క్షీరాబ్ధి॥

**భావామృతం**

క్షీరసాగరమున జన్మించుటజేత క్షీరసాగరకన్య అయిన శ్రీమహాలక్ష్మికి పద్మవాసిని అయిన అలమేల్మంగమ్మకు మంగళహారతులివిగో!

పద్మనేత్రియైన పద్మావతీ దేవి యొక్క వదనమునకు జక్కువపిట్టలను బోలిన స్తనయుగ్మముపై అంటిన కర్పూరముతో వెలసిన కర్పూర నీరాజనమిదియే. ఈ అలినీలకుంతల (నల్లనిముంగురులు గల రమణి) చక్కటి కొప్పునకు, కమలముల వంటి (తామరపువ్వుల వంటి) చేతులకు మాణిక్యములతో నిలిచిన నీరాజనము ఇదే.

చిగురుటాకులవంటి పాదములకు, అరటి బోదెల బోలిన ఊరువులకు ఆసక్తితో నొసంగు ముత్యాల మంగళహారతి ఇదియే. దుస్సహమైన మొలకు, హరినారి నాభికీ పలువన్నెల మంగళహారతి సమర్పింతుము.

అలంకారములచే ప్రకాశించు శ్రీవేంకటనాధుని పట్టపు రాశి ఈ అలమేల్మంగమ్మ. పదునారు కళలతో వర్ధిల్లు ఈ సతి శ్రీమహాలక్ష్మి యొక్క దివ్య రూపమే కదా! లోకమాతయైన ఈమెకు భక్తి పూర్వకమైన నీరాజనము ఇదివో. లోకాలను పరిపాలించే మా తల్లి అలమేల్మంగమ్మ సౌందర్యమునకు విస్తృతమైన మంగళ నీరాజనములను సమర్పించుచున్నాను.

**శో॥ శ్రీవైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీ తటే**
**రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళ**

శ్రీపద్మావతీ సమేత శ్రీశ్రీనివాస
పరబ్రహ్మణే నమః
శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ



Scanned with CamScanner